# తలరాత

అభిమానాన్ని చంపుకుంటూ "వేణూ! ఒకటూ రూపీసుంటే ఇవ్వు...ఉద్యోగం దొరకంగానే నీ డబ్బు నీకు పంపించేస్తా" అని సిగ్గుతో అదోలా మొహం పెట్టి శర్మ అడిగేసరికి దాదాపు గుండె ఆగినంత పనైంది నాకు. ఎలాంటి వాడికి ఎట్లాంటి స్థితొచ్చిపడింది! ఈలాంటి 'టూ-రుపీస్‌లూ, త్రీ-రుపీస్‌లను' శర్మ ఎన్నోమార్లు నాకు యిచ్చాడు. వాటిని ఇమ్మని అతనూ ఎన్నడూ అడుగలేదు - నేనూ ఇవ్వలేదు ఇప్పుడు కూడా శర్మ వాటిని ఇమ్మని అడగటం లేదు అప్పుగా ఇమ్మంటున్నాడు రెండురూపాయలు-అంతే. చివరికి శర్మకే గతి వచ్చిపడింది.

ఆనాడు చిలుక్కి చెప్పినట్లుగా నేనెంత చెప్పా! ఒకరిమాట వినే ఘటమైతేగా...

"ఒరేయ్ శర్మా! మీ అమ్మపోయాక మీ నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకొని నీ సవతి తల్లిమాటలు విని నిన్ను ఇంటినించి తరిమికొట్టేశాడు. ఫోర్తుఫారం చదువుతున్న వాడివి-అలాగే చదువుకు స్వస్తిచెప్పి ఎలాగో ఈ బొంబాయివచ్చి పడ్డావ్. నీ అదృష్టంకొద్దీ మీ సేట్ దగ్గర ఉద్యోగం దొరికి, కొద్దిరోజుల్లోనే-నీ పని నిపుణత వల్లనో, మంచితనంవల్లనో గొప్ప హోదా పొందావు. ప్రెస్ మేనేజరంటే సామాన్యమా?.. B. A. చదివీ కూడా ఈ కాలంలో ఉద్యోగాలు దొరక్క అవస్థలు పడేవాళ్ళను ఎంత మందిని చూడటం లేదు? రెండు వందల యాభైరూపాయలు, నీ ఫోర్తుఫారం చదువుకు ఎవరిస్తారు చెప్పు. ఇంతా ఎందుకు చెప్తున్నానంటే నువ్వు ముందు సంగతి చూసుకోక, మంచినీళ్ళ ప్రాయంగా డబ్బు ఖర్చుపెట్టేస్తున్నావ్. నీకొక్కట్టే నేనింత ఇదిగా చెప్పుకొస్తున్నాను-ఆఖరికి మా సొంత తమ్ముడికి కూడా ఇలా చెప్పేవాణ్ణి కాను. కనుక-కొంత డబ్బు, నీది కాదనుకొని ఏ సేవింగ్స్ బేంకులోనో వేస్కుంటూరా...ముందు నీకది ఉపయోగమౌతుంది" అన్నాను.

నామాటను బొత్తిగా తీసివేసేందుకు వీలులేనందుచేత "అలాగే" అని అన్నాడే కానీ, ఒక నాలుగురాళ్లను వెనకేసుకు రాలేకపోయాడు జీతండబ్బులు చేతికి అందగానే, పదతారీఖులు తిరగక మునుపే మాయంచేసేసేవాడు. పైగా ఎక్కడెక్కడో అప్పులుకూడా చేస్తున్నట్లు నాకు తెలియవచ్చింది. అంచేత ఊరికే నోరుపారేసుకోవటమేకానీ - ఇహ చెప్పి లాభం లేదనుకొని, అప్పట్నించీ ఆ ఊసెత్తడమే మానేశా.

ఆవేళ ఆదివారమనుకుంటాను... మధ్యాహ్నం లాడ్జ్‌లో అన్నపానాదులు ముగించుకొని శర్మగదికి బయలుదేరా. గదితలుపులు మూయకుండా అలాగే మంచంమీదపడుకొని నిద్రోతున్నాడు శర్మ. వాడి నెందుకు లేపటమనుకొని అక్కడున్న ఏదో పత్రికవుంటే దానిని తిరగేస్తుకూర్చున్నా. ఉన్నట్లుండి "ఇందిర ఇందిర...ఇందిర"

శ్రీ జి. వి. జి. కృష్ణ

అని ఏదో పలవరించాడు. వెంటనే నేను నిద్రలేపి, "ఏమిట్రా...ఏదో ఇందిర అంటున్నావ్? ఎవరు?" అని అడిగా. ఆ నిద్రమత్తులో ఏ మూడ్సులో ఉన్నాడో ఏమో కుండ పగలగొట్టినట్లు అంతా చెప్పేశాడు — నెల్లూరిలో తన మేనమామ కూతురు ఇందిర వుందనీ, తన తల్లి బ్రతికుండేరోజుల్లో ఇందిరను తనకే ఇచ్చి పెళ్ళిచేయాలని పెద్ద ఎత్తున రాద్ధాంతం జరిగిందనీ, ఇందిరకు తనంటే ఇష్టమేననీ, చిన్నప్పుడు ఎంతో స్నేహంగా ఇద్దరూ ఆడుకొనేవారనీ చెప్పాడు శర్మ.

"నీ పిచ్చిగానీ — ఆ అమ్మాయికి ఇంతవరకూ పెళ్ళయివుండదనుకుంటున్నావా?" అన్నాను...

"లేదూ — అది కాదు కూడాను... గట్టిగా బల్లగుద్ది చెప్పగలను".

"నీ మొహం...నీకెలా తెలుసు, ఇక్కడెక్కడో ఎన్నో వందల మైళ్ళదూరంలో ఉన్నవాడివి. పోనీ...మీ మామకూ నీకూ ఉత్తర ప్రత్యుత్తరాలేమైనా జరుగుతుంటాయా?"

"ఊహూఁ...అలాంటి దేమీ లేదు. అసలింతకీ నేనిక్కడవున్న సంగతి మా మామకు తెలుసునో లేదో!..."

"మరి?"

"నా చిన్ననాటి మిత్రుడు శంకరం అనే అతను అన్ని సంగతులూ తెలియచేస్తుంటాడు నాకు...నిన్ననే ఒక జాబు వచ్చింది వాడి దగ్గర్నించి..." అంటూ ఒక ఉత్తరం తీసి ఇలా చదివాడు. "ఇక్కడ అంతా క్షేమం......నీ యోగక్షేమాలను వ్రాస్తూండేది......ఊఁ...... అయిందా.. మీ మామగారింట్లో కూడా అంతా క్షేమం. నిన్నకూడా ఇందిరకు ఒక పెళ్ళిచూపు వచ్చిపోయింది. ఇందిర వప్పుకున్నట్లు లేదు..." అని తాను చదివిందికాక, ఆ ఉత్తరంలో మిగతా సంగతులు కనపడకుండా వుండేటట్లు మడిచి, ఆ రెండు ముక్కలనూ నాకు చూపించి సంతోషంలో మునిగిపోయాడు.

"ఇలా ఎన్ని సంబంధాలు వస్తూన్నా ఇందిర వాటికిఒప్పుకోకుండా వుందంటే-ఇందిరకు నామీద మనసుందంటావా వేణూ?" అని అడిగాడు నన్ను.

"ఎలా అనుకోమంటావ్ శర్మా! నువ్వే చెప్పు. ఆడవాళ్ళ మనసులను అర్థం చేసుకోవటం — నువ్వనుకున్నంత తేలికైన పని కాదు. చిన్నప్పుడు మీరిద్దరూ అమిత స్నేహంగా ఉండేవారని అంటున్నావ్. కొందరి విషయాలలో చిన్ననాటి ప్రేమే పెద్దయ్యాక బాగా చిగురించి క్రమేణా ప్రేమగా పరిణమిస్తుంది...కానీ మీ విషయంలో ఎలా పరిణమిస్తుందో చెప్పలేను"

"పోనీ, ఇందిరకు నిన్నే చేసుకోవాలని ఇష్టముందనుకుందాం......మీ మేనమామ ఇష్టపడక్కర్లా? ఆయన ఒప్పుకోవాలా?"

"ఎందుకు ఒప్పుకోడూ అంట... నేనేమైనా పరాయివాడ్నా?...నా ఉద్యోగం హోదా, ఏమాత్రం తెలుసున్నా ఆయనే ఇంకోహరికోసం ప్రయత్నం చేసేవాడంటావా?"

"అదిమాత్రం ఎలా అనుకోమంటావ్?.. మీ అమ్మ వుండివుంటే అందులో ఏమాత్రమైనా జరిగివుండేది. ఇప్పుడు ఆమే లేకపోయె. పోనీ మీ నాన్నను మాట్లాడమా అంటే ఆయన భార్యాలోలుడై నీ సంగతి వదిలేశాడు...నీకిక 'నా' అనే వాళ్లైవ

# తలరాత

...రైనా ఉన్నారా, ఆస్తి వుందా, విద్య వుందా ???"

"ఆస్తినీ, విద్యనూ కట్టుకొని ఏవరం చేస్కుంటారు వేరూ?...నువ్వు ఇలా మాట్లాడితే ఎలాగ... అంద చందాలూ, గుణగణాలూ, తగిన హోదా లేక ఎంత ఆస్తి వుండీ, ఎంత విద్యవుండీ ఏం ప్రయోజనం చెప్పు?"

"అని నువ్వంటావ్...బాగానే వుంది. కానీ, మీమామ కుంపెక్కర్లా ఆ మాత్రం జ్ఞానం?"

"ఇందిర ఎవర్నీ ఒప్పకపోతే, చివరికి నాకు తప్ప ఇంకెవరికిస్తారులే" అనేసి ఇంతటితో అప్రస్తావన మార్చేశాను శర్మ.


ఇంకో రోజు శర్మకు మళ్ళీ వాళ్ళ ఊరి గుప్పు గాలి సోకినట్టుంది "చిన్నప్పుడు పరికిణీలు కట్టుకుంటేనే ఇందిర మొహానికి ఎంతో ముచ్చటగా వుండేది...ఇప్పటికి పెద్ద మనిషైవుండొచ్చు...చీరలు కట్టుకుంటే ఎలా వుంటుందో చూసి రావాలి...అలాగే పాతమిత్రులందర్నీ చూసిరావాలి ఓ పది రోజులు శెలవుతీసుక్కొనివెళ్ళి," అన్నాడు.

"ఇంకా మేనేజర్ హోదా లభించి తీరా ఒక్క నెలన్నా కాలేదు. అప్పుడే నువ్వు లీవ్ తీస్కొనిపోతే ఎలాగుంటుంది శర్మా!" అన్నాను నేను.

"ఎలాగుండేదేమిటి ... మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నా ఒక్కరోజయినా శెలవు తీసుకున్నానేమో, నువ్వే వచ్చి మానేజర్‌ని అడుగు... తెలుస్తుంది...ఇంత ఇదిగా గాడిద చాకిరీ చేస్తుంటే... ఒక్క నెలయినా శెలవు ఇవ్వనంటావా మానేజరు...ఆ నెల జీతం ఇవ్వకపోయినా పీడాపోయే" అన్నాడు శర్మ.

(54-వ పేజీ చూడండి)

రాయలసీమ, చిత్తూరు పర్యటన సందర్భంలో పత్రికా ప్రతినిధులతో కలిసి ఫొటో తీయించుకున్న పండిట్ నెహ్రూ.



# తలరాత

(10-వ పేజీ తరువాయి)

ఆవేళ దీపావళిపండుగ. స్టూడియో లేనందుచేత, తెల్లవారి నిద్రలేచినవాణ్ణి బద్ధకంగా అలాగే పడుకొనివున్నాను. శర్మ ఈలవేస్తూ వచ్చి కూర్చొన్నాడు. నేను మంచంమీద లేచి కూర్చొని "ఎప్పుడొచ్చావ్ శర్మా?... ఇదేమిటి ఎన్నడూ లేనిది ఇవ్వాళ మా గదికి" అన్నాను. ఎగిరి గంతేసి "ముందు ఒక్క షేక్-హాండ్ ఇచ్చేసి ఆ మైకంలో పడిపో" అని అమితానందోద్రేకంలో చేయి జాపాడు శర్మ. "ఏమిటో చెప్పవోయ్" అని నేను ఓ వైపున తెల్లబోయి అడుగుతూంటే - నాచేయి నాకు తెలీకుండానే అతనిచేతిలో నలిగి పోయింది. జేబీనించి ఒక కార్డు తీస్తూ "మా మామకు క్షయట. ఎలాగో నావిలాసాన్ని తెలిసికొని, ఆయనే స్వయంగా ఉత్తరం రాశాడు" అని ఆనందంలో మునిగి తేలుతున్నాడు శర్మ.

"అరె! క్షయా?... అందుకు నువ్వు సంతోషిస్తున్నావా?" అని తికమకలు పడుతూ అడిగాను.

"ఇందా...ఇది చదువుకో" అని జాబు నామీదికి విసిరేసేశాడు. ఆ జాబులో వాళ్ళ మేనమామ తను నాలుగయిదు నెలలుగా క్షయరోగంతో బాధపడుతున్నట్లూ, తానిక బ్రతికి నన్ని రోజులు బ్రతకలేడు కనుక ఇందిరను శర్మచేతిలో పెట్టి కళ్ళు మూయాలనీ ఇంకొక ఏడెనిమిదిరోజుల్లో మంచి లగ్నాలున్నాయనీ, ఉన్న వ్యవధిలోనే అతివైభవంగా జరుపదలిచాడు కనుక, ఇదొక టెలిగ్రాంగా భావించి నిలుచున్న పళంగానే శర్మను బయలుదేరి రమ్మని పదేపదే వ్రాశాడు. జాబంతా చదువుకొని "అయితే ఇపుడు నువ్వేమి టనుకుంటున్నావ్" అని ప్రశ్నించా. "అనుకోవట మేమిటి, రాత్రే ప్రయాణం...ఊఁ... బెడ్డింగ్ గిడ్డింగ్ సర్దుకో" అని మంచం మీదనించి లేవదీశాడు నన్ను.

"అరెరె....నే నెందుకోయ్...క్షమించాలి. ఈ పరిస్థితుల్లో నేను రాలేను... కెమరా అసిస్టెంట్ గా కాంట్రాక్ట్ సైన్ చేసింది మొన్న నేనన్న సంగతి నీకు తెలిసిందేగా...మా స్టూడియోవాళ్ళ సొంత ప్రొడక్షన్ "వీరనారి" షూటింగ్ రేపుంది. అదీ లాంగ్ షాట్... నేను కనక దగ్గరుండకపోతే ఛీఫ్ కెమరామేన్ పని సున్నే..." అన్నాను నేను.

"సరే రాకపోతే పోయావ్ గానీ, ఇంకో వారం రోజుల్లో ఏదో ముహూర్తాలున్నాయని రాశాడుగా...అంచేత వెళ్ళాక ఎప్పుడో తెలుసుకొని ఒక శుభలేఖ పంపిస్తా... ఇక్కడ్నించే ఆశీర్వాదాలు విసిరేసేయ్."

"దానికేం గానీ...అన్నట్లు మీ సేటు మంజూరీ చేశాడా నీకు శెలవు?"

"వాడు మంజూరు చేయకపోవడమేమిటి?" అని ఏదో చిత్రంగా నవ్వుతూ అన్నాడు. ఆ నవ్వుకు అంతరార్థ మేమిటో నా కానాటికి తెలీదు. "ఆఁ...వస్తానోయ్...పెట్టే బేడా సర్దుకోవాలి. బోలెడంత పనుంది.. సాయంత్రం ఆరుకే రైలు. వెళ్ళేటప్పుడు ఓమారు ఇటొచ్చిపోతాలే...స్టేషన్ కు రాగలవా...వస్తా" అని ఒకేగుక్కలో పలికి నా జవాబుకు ఎదురు చూడకుండా నిష్క్రమించాడు. అంతే వెళ్ళినవాడు అదే పోత...మళ్ళీ నా గదితట్టు రానేలేదు. అతను వెళ్లి వుంటాడో లేదో తెలుసుకొనేందుకని మర్నాడు వుదయం అతని గదివైపు బయలుదేరా. కొద్దిదూరంలో వుండగానే, అతని గది ముందు కొందరు మూగివున్నట్లు కనపడే వరకూ ఏం కొంప మునిగిందోనని గాభరాతో దౌడు తీశా. అతని గది తలుపులు తీసున్నాయ్...లోపల ఒక్క సామానూ లేదు. ఇంతలో అక్కడున్న సేట్ హిందీలో ప్రక్కనున్న మనిషితో అంటున్నాడు.

"శర్మాజీ నూరురూపాయలు ఎక్కువగా ఎత్తుకొని పోయినందుకు నా కేమాత్రం విచారంలేదు మిస్టర్! ఇంతపనితీవ్రతలో ఎవరితోనూ చెప్పకుండా చెయ్యకుండా అదీ నేను ఊళ్లోలేని సమయాన వెళ్ళిపోవటమే నా కమిత కష్టంగా వుంది. నేను తలవని తలంపుగా ఈవేళ వచ్చేశాను గనక సరిపోయింది, లేకపోతే ఈవేళ ప్రెస్ ఎలా పనిచేసేది...ఎంత నష్టం వచ్చివుండేదీ...నిజంగా శర్మాజీ ఇలా చేస్తాడని నే నెన్నడూ అనుకోలేదు" నిన్న శెలవుగురించి ప్రశ్నించిందానికి, జవాబుగా శర్మ నవ్విననవ్వుకు అర్థమేమిటో ఇప్పుడు నాకు తెలిసింది. బరువెక్కిన హృదయంతో మెల్లిగా కాళ్లీడ్చుకుంటూ నా లాడ్జ్ ముఖం పట్టా.

లగ్నపత్రిక పంపిస్తానని వెళ్ళాడే కానీ, వెళ్లిన మనిషి ఒక కార్డయినా రాసిన పాపానపోలేదు. బహుశః అతనికి నా సరియైన విలాసం తెలిసుండకపోవచ్చు. అతను నా అడ్రసునైనా అడిగి తెలుసుకొనుంటే బావుండేది. చివరికి ఉత్తర ప్రత్యుత్తరాలు లేకపోగా, మా ఇద్దరిమధ్యా వున్న స్నేహం అడుగంటకుండా ఉండాలని ముక్కోటి దేవతలకు మ్రొక్కుకున్నా.

శర్మ వెళ్ళిపోయాక అత నంతటి మనిషితో కానీ, కనీసం తెలుగు వచ్చిన ఇంకొక మనిషితో కానీ నాకు పరిచయం కాలేదు. ఒకవేళ పరిచయమై వుండినా అది అంత ఇదిగా వుండేదికాదు. శర్మ వెళ్ళిపోవటం నా అమిత ఆప్తుల్లో ఒకరు వెళ్ళిపోయినట్లుంది. ప్రతిదినమూ స్టూడియోకు వెళ్ళేటప్పుడు శర్మ వుంటూండిన గది ముందుగా వెళ్ళాలి...ఆ గది చూసినప్పుడల్లా నా మనసులో ఏదో చెప్పలేని ఆవేదన కలిగేది....క్రమేణా బొంబాయివాసం విసుగెత్తుతూ వచ్చింది నాకు.

ఎనిమిది నెలలు గిర్రున కాలప్రవాహంలో కొట్టుకుపోయాయి. నా పేరు ప్రఖ్యాతులు విని మద్రాసునించి ఛీఫ్ కామెరామేన్ గా ఆహ్వానం వచ్చింది. ఒక శుభ దినమున, వారి ఆహ్వానాన్ని మన్నించి వెంటనే మద్రాసొచ్చిపడ్డాను. నా కింతటి ఉద్యోగం దొరికిందన్న సంతోషం కంటే, శర్మ వుండే ఊరికి దగ్గరగా వచ్చానన్న సంతోషమే ఎక్కువగా ఉండింది. ఎప్పుడైనా వీలు దొరికితే, నెల్లూరి కెళ్ళి శర్మ గురించి వాకబుచేయాలనుకున్నాను. ఆ అదృష్టం కూడా నాకు కలిసొచ్చిందనే చెప్పాలి. పెన్నానది వరదల్లో వుందని తెలియంగానే, మా చిత్రంలో వరదల సీన్ లున్నందున కొన్ని షాట్సు తీసేందుకు, మా డైరెక్టరు ఉన్నట్లుండి ఒక్క రోజు నెల్లూరికి పిలుచుకుని వెళ్లాడు. పెన్నా షాట్సు తీస్తున్నానే కానీ, నా మనసంతా అక్కడ లేదు—అంతా శర్మ మీదనే వుంది. ఎప్పుడు వచ్చిన పని ముగుస్తుందా, ఎప్పుడు శర్మను చూస్తామా అన్న ఆత్రంలో వున్నాను. మా కెమెరా చుట్టూ ఎంతో జనం మూగివుంటే "అడ్డం లేవండీ...కాస్త తప్పుకోండీ" అని మా డైరెక్టర్ కేకలు పెట్టున్నాడు. ఎదురుగా పెన్న హోరున శబ్దం చేస్తూ పొంగిపొరలి ప్రవహిస్తూంది...... సూర్యునికి అడ్డంగా మబ్బు రావటంచేత ఎండ తగ్గిపోతూంది. "ఇహలాభంలేదు.. ఇప్పట్లో ఎండవచ్చేటట్లు లేదు. మళ్లీ మధ్యాహ్నంవచ్చి ట్రైచేద్దాం" అన్నాడు

మాడై రెక్టరు. చెమట తుడుచుకుంటూ మెల్లిగా ప్రక్కకు తిరిగి చూశా — అప్రయత్నంగా. ఒక వ్యక్తి ఎందుకో దొంగతనంగా జారుకుంటున్నాడు. నా కనుమానంకల్గి పెద్ద అంగలు వేస్కుంటూ వెళ్ళి ఆవ్యక్తిని పట్టుకొని తేరిపార చూశా ...“ఇదేంటి శర్మా! ఇలా ఐపోయావ్?” అని నాకు తెలియకుండానే నానోటినించి మాటలు జారిపోయాయ్... శర్మ నా మొహంకేసి చూడలేకపోతున్నాడు.

“ఊ...రా...” అని అతనినికూడా మా కారులోనే లాడ్జికి పిలుచుకొని వెళ్లా. మంచంమీద కూర్చొని ఆవైపు మొహం త్రిప్పుకొని చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు శర్మ!

“భోజనమైందా?” అని అడిగా. జవాబు లేదు. తర్వాత అంకుశంతో పొడిచినట్టు గుచ్చిగుచ్చి అడగగా చెప్పలేక చెప్పలేక చెప్పుకొచ్చాడు.

“పెళ్లయిపోయిన మర్నాడే మా మామ గతించాడు. ఇందిరతో, నేను బొంబాయిలో ఒక ప్రెస్‌లో మేనేజరుగా పని చేస్తున్నాననీ, శెలవుమీద వచ్చాననీ చెప్పాను. ‘ఎప్పుడెళ్లుతామండీ బొంబాయికీ, బొంబాయి ప్రయాణం ఎప్పుడండీ’ అని ప్రతిదినమూ ఇందిర నన్ను వేధించుకు తింటూండేది. ‘పోదాం ఉండూ......తొందరపడితే ఎలాగ......మూడున్నర ఏడాదిగా బొంబాయివాసంతో విసుగెత్తి వచ్చానా? ఇక్కడ పాత మిత్రులందర్నీ చూసింది కానీ, తర్వాత వెళ్దాం’ అని ఎలాగో అబద్ధాలు చెప్పి, కొన్నిదినాలు నెట్టుకొని వచ్చాను. చివరికి ఒకదినం నిలదీసి అడిగేసింది ఇందిర: ‘ఇంకా ఇక్కడ ఎన్నాళ్లని గడగలమండీ?...ఇక్కడ వున్నకొద్దీ మనకు మర్యాద వుంటుందా? అందరూ అడుగుతున్నారు నన్ను బొంబాయికి ఎప్పుడు వెళ్లేదని...వాళ్లందరికీ ఏం జవాబు చెప్పమంటారూ?’ అని వెక్కి వెక్కి ఏడుస్తూ అడిగింది. ఆరోజు రాత్రి ఇందిరతో ఏదో ఒక అబద్ధం కల్పించిచెప్పక తప్పిందికాదు. నేను పనిచేస్తూన్న ప్రెస్ దివాలా తీసిందనీ, అంచేతనే నే నీవూరు రావటమూ పెళ్ళిచేసుకోవటమూ జరిగిందనీ, లేకపోతే నిన్ను పెళ్ళిచేసుకుంటానని నే నెన్నడూ అనుకోలేదనీ, ఏదో అప్పటికి తోచింది నాలుగుకోతలు కోసేశా. దానితో దాదాపు గుండె ఆగినంత పనైంది ఇందిరకు. ఏడవడం మొదలెట్టింది. అంతటితో ఆగక, మొగుడినన్న గౌరవమైనా లేకుండా, చీటికి మాటికి నానా మాటలు అనడం మొదలెట్టింది నన్ను. అప్పట్నించి ప్రతిదినమూ జగడాలూ ఏడుపులూతప్ప ఇంకోపాటిలేదు. చిన్నప్పటి ఇందిరకూ, ఇప్పటి ఇందిరకూ ఎంతో భేదం వుందన్న సంగతికూడా నాకు అప్పుడే తెలిసింది. నేనుండేస్థితి తెలిసుండీకూడా, నా సుభూతి చూపించకపోగా, ఒకరోజు ఫేస్ పౌడర్ తెచ్చీమనీ, ఇది తెచ్చీమనీ, అది తెచ్చీమనీ చంపుకొని తినేది ఇందిర. ఎలా తెచ్చిగలను చెప్పు...ఆ మైన ‘ముష్టి ఫేస్ పౌడర్ డబ్బీ తెచ్చిచ్చేందుకు యోగ్యతలేనివాడు, అక్కడేదో బొంబాయిలో పెద్ద గవర్నర్ గిరీ చెలాయిస్తూన్నట్లు అబద్ధాలాడి నాగొంతెందుకు కోశావ్’ అని మొహంమీదనే అడిగేస్తూంటుంది. పెళ్లంటే ఏదో స్వర్గసుఖాలనుభవించడానికి తగిన అవకాశమనీ, అందులో ఇందిరవంటిదానితో పెళ్లి జరగడం నిజంగా నా పూర్వజన్మఫలం అని అనుకున్నాగానీ, ఇలా నానా ఇక్కట్లకు గురి అవుతానని ఏమాత్రం తెలిసున్నా, నేనిలాంటి పిచ్చిపని చేసుకునేవాడ్నా?” అని కళ్ళనీళ్లు కారుస్తూ అన్నాడు. శర్మ.

సిగరెట్ ను అందివ్వబోయాను. మా నేశానన్నాడు. “అది సరేకానీ...మీ అత్త వుందికదా, ఆమేమంటుందీ” అని అడిగాను. “చెప్పాల్నా...దీని అమ్మ అది... ఇద్దరూ ఒకరికొకరు డిటో...ఆమెకూడా. నా ఎదురుగా అనదుకానీపరోక్షంగా నానా మాటలు అంటూంటుంది. ఎలాగో అన్నిటికీ సహించి ఊరకుండక తప్పుతుందా?.. అంతా నా తలరాత తప్ప ఇంకేమిటి — నేనూ శక్తివంచన లేకుండా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనేవున్నా. ఈ కాలంలో ఉద్యోగాలు దొరకటం ఎంత కష్టమైనపనో నీకు తెలీనిది కాదు.” అని శర్మ అనగా “పోనీ బొంబాయివెళ్ళి మళ్ళీ మీ సేట్ దగ్గర ప్రయత్నించకపోయావా?” అని ప్రశ్నించాను...

“మళ్ళీనా!” అని మొహం చిన్నబుచ్చుకొని “ఎలా వెళ్ళేది వేణూ?... వెళ్ళితేమటుకూ, సేట్‌జీ ఉద్యోగమిస్తాడనుకోమంటావా? ... తొందరపడక ఇంకొక నాల్గురోజులు ఆగి, తర్వాత శెలవు తీసుకుని వచ్చివుంటేనన్నా అదొకవిధంగా వుండేది” అని సిగ్గుతో తల వంచేశాడు శర్మ. అవమానంతో క్రుంగిపోతున్నాడు. “పోనీ ... లేవోయ్ ... మద్రాసు వెళ్లాక — నా కొందరితోనో పరిచయం వుంది ... ఎవరితోనైనా చెప్పి నీకొక ఉద్యోగం ఇప్పించలేనా” అన్నాను. ఆ మాత్రానికే శర్మ ఏడుపు దిగమ్రింగుకుంటూ “ఆమాత్రం సాయంచేసి పెట్టు వేణూ!...నా చర్మంతో చెప్పులుకుట్టిస్తా” నన్నాడు. శర్మ ఇంతగా దిగజారిపోయినందుకు నా కెంతో కష్టంవేసింది.

“ఇందిరా-ఇందిరా అని తల్లడిల్లిపోయి, తల క్రిందులైనావ్ కానీ, ఇపుడు ఇందిరను పెళ్లిచేసుకుని నువ్వేం సుఖపడుతున్నావంటా? ఇందిరతో తప్పితే నీకసలు పెళ్ళే కాదా అని అడుగుతా?? వృథాగా తొందరపడి ఈ స్థితికొచ్చావ్. కానీ, ఇందిరసంబంధాన్ని తలదన్నే తాతలట్లాటి సంబంధాన్ని తెచ్చి నీకు చేసేవాడ్ని — ఏంటనుకుంటున్నావో నువ్వు?” — అని ఇంకా ఏదేదో చెప్పబోతూంటే నా అర్థంలేని ఆవేశాని కడ్డుపడి “చాలు వేణూ! చాలు, గాయపడిన నాహృదయాన్ని ఇంకా బాధించకు...తప్పంతా నాదే వొప్పుకుంటున్నాను. నేను చేసిన తప్పిదానికి తగిన ప్రాయశ్చిత్తాన్నే ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను ... నే నిదివరకూ నీకేదైనా సహాయంచేసివుంటే దానికి ప్రతిఫలంగా, నీ ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించి నాకొక ఉద్యోగం ఇప్పించి నా జీవనోపాధికి మార్గం కలిగించు...చస్తే నీ కడుపున పుట్టాను” అన్నాడు శర్మ.

“నువ్వు చావనూవద్దు నా కడుపులో పుట్టనూవద్దు. కానీ, నీ సరియైన అడ్రసు చెప్పు” అని కాగితం కలమూ తీసుకుని అతని విలాసాన్ని రాసుకుని, నా విలాసాన్ని అతనికి రాసిచ్చి “ఇలా చూడు శర్మా! మనమనుకునే పనులు సవ్యంగా నెరవేరకపోవడం, మానవునిపట్ల జరిగే అన్యాయాలలో ఒకటి. అంతమాత్రానికే జీవితంలో దిగజారుడూ, జీవితంపై అసహ్యం రోత, ఇలాటివి కలగాల్సిన అవసరం ఏమాత్రమూ లేదు. దానికి తావిస్తే నిజంగా భవిష్యత్ అంధకారమే! అసలెప్పుడూ మన అంచనాలు అత్యున్నత శిఖరాలనంటేటట్లుండడం అంత మంచిదికాదు. ఎందుకంటే-అవి నెరవేరనప్పుడు అంత ఎక్కువగా విచారపడాల్సొస్తుంది. అందుకని జీవితాన్నెప్పుడూ మామూలుగా, సాఫీగా నడుపుకుంటూంటే, కష్టసుఖాలెప్పుడూ అంత తీవ్రంగా బాధించవు. ఐతే సాహసాలు చేసేవాళ్ళకు ఈసూత్రం పనికివస్తుందని నేననలేను. ...అంతే! ... జీవితంలో ఎంతవరకూ దిగజారిపోవాలో అంతవరకూ దిగజారి పొయ్యావు నువ్వు.

నీవు ఎలాటి స్థితిలో ఎక్కడున్నా ఎప్పటి కప్పుడు నీ స్థితిగతులనూ, ప్రయత్నాలనూ, మిత్రుడైన నాకు తెల్పడంలో నీకొచ్చే అవమానమూ తప్పూ ఏమాత్రం ఉందని నేననుకోను.” అని ఒక పెద్దని

# తలరాత

ఇచ్చాను. నే చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడో లేదో చెప్పలేను. కానీ భోజనం తాగినవాడి మొహంపెట్టి ఏదో దిగాలుగా నీరు కారుతూండటం మాత్రం గమనించా. ఇంతలోగా హోటల్ సర్వరొడు కాఫీ ఫలహారాలను తెచ్చి టేబిల్ మీదపెట్టి వెళ్ళబోతూండగా ఇంకో కాఫీ తెమ్మని వాడితో చెప్పేసి "ఊఁ...తీసుకో శర్మా...నాకొస్తుందిలే" అన్నాను. తిండితిని ఎన్నోరోజులైన వాడిమల్లే గబగబా తినేశాడు. కాఫీ త్రాగుతూ "వేణూ! ఒక టూరుపీస్ వుంటేఇవ్వు...ఉద్యోగందొరకంగానే నీ డబ్బు నీకు పంపించేస్తా" అని సిగ్గుతో అదోలా మొహంపెట్టి అడిగేసరికి దాదాపు గుండె ఆగినంత పనైంది నాకు. నిజంగా ఎట్లాటివాడికి ఎట్లాటిస్థితొచ్చి పడింది పుడు అనుకుంటూ లేచి కోటుజేబీనించి మనిపర్సు తీశా. పదిరూపాయలనోట్లు ఏడున్నవి. రెండు పదిరూపాయలనోట్లుతీసి శర్మ చినిగిన షర్టు జేబీలో దూర్చుతూ "ప్రస్తుతానికి దగ్గర ఇవి వుండనీ, మద్రాస్ వెళ్ళాక కొంత పంపిస్తా" నన్నాను.

"ఇంతెందుకూ, రొండే చాలంటూంటే? పైగా మద్రాసుకు వెళ్ళి వేరె పంపిస్తా నంటున్నావా?" అని తెల్లబోతూ అడిగాడు శర్మ. "పర్వాలేదు ఉంచుకో" అని చెప్పి మాట్లాడకుండా టాపిక్ లోకి దించేశా. ఇంకా ఏవేవిటో వాడు దాదాపు తొమ్మిదినెలలుగా పడుతూండిన కష్టాలనన్నిటినీ చెప్పుకువచ్చాడు. "ఏమోనోయ్. నాకెంతో భయంగావుంది... ఎక్కడ చూసినా రిట్రెంచ్ మెంటులు... నాకెప్పుడు ఉద్యోగం దొరుకుతుందో ఏమో...నాకు ఉద్యోగం దొరకాలీ— ఇందిర గర్వంఅణాచాలీ...అది నన్నీస్థితిలో ఎంతేసి మాటలాడి ఎన్నెన్ని బాధలు పెట్టిందో, దానికి వడ్డీతోసహా అనుభవించేటట్లు చేస్తాను...నాకుఉద్యోగం దొరకాలీ ఇందిర గర్వం అణాచాలీ..."

"ఉద్యోగం దొరకాలీ-ఇందిర గర్వం అణాచాలీ" ఈ మాటలే మద్రాసు కొచ్చేదాక కూడా ప్రతి దినమూ నా చెవుల్లో గింగురుమంటూన్నవి. వచ్చిన రెండు నెలలుగా శర్మకు ఉద్యోగంకోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నా కానీ ఇంతవరకూ నా కృషిఫలించలేదు... శర్మకు ఎప్పుడు ఉద్యోగం దొరుకుతుందో-నా ఎప్పుడు ఇందిర గర్వం అణుస్తాడో ఏమిటో-అంతా అయోమయంగా ఉంది. ఇంతకీ-వాడి తలరాత ఎలా వుంటే అలా నడిచి తీరుతుంది.

# సినిమా వార్తలు

(51—వ పేజీ తరువాయి)

జేసి కేవలం డాక్యుమెంటరీ చిత్రంలో "ఇమోషన్" సృష్టించటం అద్భుతమైన ప్రజ్ఞగా తోస్తుంది. మన దేశంలోను, అమెరికా మొదలైన దేశాల్లోను చిత్ర నిర్మాణంలో ప్రధానవ్యక్తి దర్శకుడు. ఎడిటింగ్ పనిని మనం అప్రధానంగా పరిగణిస్తాము. రష్యాలో అట్లా కాదు. ఫిలిం షూట్ చెయ్యటం అయిపోయిన తర్వాత కూడా దర్శకుడు చెయ్యవలసిన పని ఎంతో ఉంటుంది. అక్కడి దర్శకులు ఎడిటింగ్ పని కూడా తామే చేస్తారు. రష్యన్లు ఎడిటింగ్ ను ఒక కళగా పెంపొందించారు. తాము చేయవలసిన అసలు పని ఎడిటింగేనని కూడా రష్యన్ డైరెక్టర్లు విశ్వసిస్తారు. "లెనిన్ జీవితం" అనే చిత్రంలో 1905 నాటి విప్లవాన్ని, 1917 నాటి విప్లవాన్ని చిత్రించిన విధానం గూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సమూహ దృశ్యాలు తీయటంలో రష్యన్లను మించిన చెయ్యిలేదు. వేలకొలది సైనికులు కనిపించే లాంగ్ షాటు, దాని వెంటనే ఒక సైనికుని చేతిలో తుపాకి క్లోజప్—ఈ విధంగా ప్రతి షాట్ భయంకరమైన శక్తితో, జలపాతంలాంటి వేగంతో ప్రేక్షకులమీద విరుచుకు పడుతుంది. ఇదంతా ఎడిటింగ్ మహత్తే. ఈరకమైన ఎడిటింగ్ విధానానికి రష్యన్లు ఉపయోగించే పేరు "మాంటేజ్."

*　　*　　*

హిందీ సంగీతదర్శకుడు సి. రామచంద్ర న్యూశాయ్ ప్రొడక్షన్సు అనేసంస్థ స్థాపించి "ఝుంఝూర్" అనే చిత్రం తీస్తున్నాడు. ఈ చిత్రంలోని కొన్ని దృశ్యాలు ఇండోనీషియా, జపాన్, థాయ్‌లాండులలో తీస్తారట. ఆ దేశాలకు డైరెక్టర్ కిదార్ శర్మ, నిర్మాత సి. రామచంద్ర, నటుడు భగవాన్, గాయకి లతామంగేష్కర్ మున్నగువారు వెడతారట. [illegible] సంస్థ "[illegible]" అనే ఇంకొ చిత్రాన్ని కూడా ప్రారంభించింది.

*　　*　　*

బొంబాయి [illegible] యోను సహకారపద్ధతిమీద నడుపుతున్న స్టూడియో కార్మికుల సంఘంవారు "కోహినూర్" అనే చిత్రం ప్రారంభించారు. ఇందుకుమార్ భట్ దర్శకత్వాన రంజన, నిరూపరాయ్, మంజూ, జైరాజ్, సప్రూ, ఉల్హాస్ మున్నగువారీ చిత్రంలో నటిస్తున్నారు.

*　　*　　*

శాంతారాం తీయబోతున్న ఒక చిత్రంలో ఏడుభాషలపాట ఒకటి ఉన్నదట. హిందీ, పంజాబీ, సింధీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తమిళ భాషల్లో చరణాలు ఉండే ఈగీతాన్ని ఏడుగురుకవులు రాశారట; ఏడుగురు ప్లేబాక్ గాయకులు పాడతారట. శాంతారాం పూర్వం తీసిన "ఆద్మీ"లో కూడా వివిధ భాషల గీతం ఒకటి ఉన్నది. అయితే ఆగీతంలో తెలుగు చరణంకూడా ఉన్నది. ఈ కొత్తగీతంలో తెలుగు లేదు.

*　　*　　*

ఇటాలియన్ చిత్రం "సైకిల్ థీఫ"ను, జపాన్ చిత్రం "యూకీవారీసూ"ను ఇండియాలో ప్రదర్శించటానికి లక్ష రూ. లు పెట్టి హక్కులు కొనుక్కున్న కర్దార్-కపూర్ డిస్ట్రిబ్యూటర్సు ఒక్క బొంబాయిలోనే ఈ చిత్రాలపై 4 లక్షల రూ. లు సేకరించారట. ఈ లాభసాటి బేరం చూసి మిగతా డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇటలీ, జపాన్ చిత్రాలు తెప్పించాలని ప్రయత్నిస్తున్నారట.

[illegible]

రచన:
మార్క్ ట్వెన్
వెలరెండురూపాయలు
తపాలాఖర్చు ప్రత్యేకము
[illegible]
మద్రాసు 1.

'ed, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty [illegible] Madras.